సాక్షి నిర్మల్

ఆదివారం । 1 । సెప్టెంబర్ । 2024



ట్రిపుల్ ఐటీలో గుత్తాధిపత్యం

బాసర ట్రిపుల్ ఐటీ అవినీతికి కేరాఫ్‌గా మారింది. విద్యార్థుల సంక్షేమానికి పాటుపడాల్సిన అధికారగణం కాంట్రాక్టర్ల సేవలో తరిస్తున్నారన్న విమర్శ సర్వత్రా వినిపిస్తోంది. 8లో▶

'భట్టి' పర్యటన రద్దు

జైపూర్/చెన్నూర్‌రూరల్: మంచిర్యాల జిల్లాలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శనివారం పర్యటించాల్సి ఉండగా.. ఆకస్మికంగా పర్యటన రద్దయింది. రోజువారీ కార్యక్రమాల్లో ఆలస్యం, ఖమ్మం జిల్లా, డిప్యూటీ సీఎం సొంత నియోజకవర్గం మధిరలో భారీ వర్షాల కారణంగా పర్యటన రద్దు చేసుకున్నారు. పెద్దపల్లి జిల్లా పర్యటన ముగిసిన తర్వాత రోడ్డు మార్గాన వెళ్లిపోయారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.4 /24.2

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. తుపాను ప్రభావంతో జిల్లా అంతటా మోస్తరు వానలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆరోగ్య ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



డీఎంహెచ్‌వోను సన్మానిస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో ఆరోగ్య ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్ అన్నారు. జిల్లా వైద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనను ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం 3194 ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. జిల్లాలో ప్రస్తుతం జ్వరాలు ప్రబలుతున్నాయని, సిబ్బంది జ్వరాల అదుపునకు కృషి చేస్తున్నారన్నారు. వర్షాకాలం సీజన్ ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణమోహన్‌గౌడ్, జిల్లా నాయకులు వేణుగోపాలరావు, బారె రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, భోజారెడ్డి, రమణారెడ్డి, వెంకటరమణ, సురేశ్‌రెడ్డి, కిషన్‌ప్రసాద్, శుభచరణ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సోన్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి, జెడ్పీ సీఈఓ గోవింద్ సూచించారు. మండల కేంద్రంలో గ్రామ పంచాయితీ సమావేశ భవనంలో సీజనల్ వ్యాధులపై శనివారం సమీక్ష నిర్వహించారు. ప్రజలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మురుగు నీటి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. గ్రామాలలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించడానికి ర్యాలీలు నిర్వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేశ్, ఏపీవో ఖలీల్ హైమద్, ఐకేపీ ఏపీఎం గంగామణి, వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, పంచాయితీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, వీఏవోలు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకున్న ఈశ్వర్

నిర్మల్‌టౌన్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జిల్లా క్రీడాశాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి బేస్‌బాల్ ఎంపిక పోటీలు శనివారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ పోటీలను ప్రారంభించారు. సుమారు 200 మంది బాలబాలికలు పోటీల్లో పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అనంతరం జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు క్రీడల్లో రాణించిన క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సెక్రటరీ గంగాధర్, ఎస్జీఎఫ్ కార్యదర్శి రవీందర్‌గౌడ్, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి అన్నపూర్ణగౌడ్, ఎస్‌జీఎఫ్ మాజీ సెక్రటరీ రమణారావు, శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

భైంసాటౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా పనిచేయడానికి అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బుచ్చయ్య తెలిపారు. తెలుగు, ఉర్దూ లాంగ్వేజ్‌తోపాటు ఎకనామిక్స్, ఫిజిక్స్ (తెలుగు - ఇంగ్లిష్ మీడియం) బోధించేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణత (ఎస్సీ ఎస్టీలకు 50 శాతం), నెట్, సెట్, పీహెచ్‌డీ, బోధన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుందని వివరించారు. అర్హులైన వారు ఈనెల 3డవ తేదీ సాయంత్రం నాలుగు గంటల్లోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 4న ఉదయం 10.30 గంటలకు ఇంటర్వ్యూ ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 99633 08287, 94414 59972 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

సామూహిక వ్రతాలు



నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని హరిహర క్షేత్రం మల్లన్న గుట్ట ఆలయంలో శనివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. 121 మంది దంపతులు వ్రతంలో పాల్గొన్నారు. ఆలయ పండితులు వ్రతం విశిష్టతను భక్తులకు వివరించారు. ఆలయ ధర్మకర్తలు అల్లోల వినోదమ్మ-మురళీధర్‌రెడ్డి దంపతులు సహకారం అందించారు.

పార్వతీ పుత్ర.. పర్యావరణహిత..

సండే స్పెషల్



మట్టితో తయారు చేసిన గణపతి విగ్రహం



మట్టి ప్రతిమకు తుది మెరుగులు దిద్దుతున్న యువతి

వినాయక చవితి వస్తోంది. అందరికీ ఇష్టమైన పండుగ ఇది. తొమ్మిది రోజులపాటు పార్వతీ పుత్రుడిని కొలిచేందుకు పిల్లలు, పెద్దలు సిద్ధమవుతున్నారు. దీంతో ఆకర్షణీయంగా ఉండాలనే భావనతో వివిధ రకాల రంగుల్లో వినాయక ప్రతిమలను తయారు చేస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారుచేసి ప్రతిష్టించే విగ్రహాల ద్వారా పర్యావరణానికి హాని. మానవాళికీ అనర్థమే అని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏటా పర్యావరణహిత విగ్రహాలపై ప్రజల్లో చైతన్యం పెరుగుతోంది.

- మట్టితో గట్టి సంకల్పం చాటుతున్న కళాకారులు..
- మట్టి విగ్రహాలపై ప్రజల్లో పెరుగుతున్న అవగాహన
- కార్యరూపం దాల్చితేనే అనర్థాలు దూరం..

నిర్మల్‌ఖిల్లా: వారం రోజుల్లో రానున్న వినాయక చవితికి జిల్లాలో ఉత్సవ కమిటీలు ఇప్పటినుంచే కార్యాచరణను ప్రారంభించాయి. పర్యావరణహితాన్ని కాంక్షించేవారు ఏటా మట్టి గణపతిని ప్రతిష్ఠించాలనే సంకల్పంతో ఉండగా, మరికొందరు ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారుచేసిన విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని ఆయా ప్రధాన పట్టణాల్లో విగ్రహాల తయారీ విక్రయాల కేంద్రాల్లో వినాయక ప్రతిమలను తయారు చేసి సిద్ధంగా ఉంచారు.

ప్రతిమను మలిచి.. ప్రాణం పోసి..



సాధారణ నల్ల బంకమట్టితో వినాయక విగ్రహాలను ఇతర దేవతల ప్రతిమలను తయారు చేయడం ద్వారా తన శక్తిమేర ప్రకృతికి ప్రయోజనం చేకూర్చుతున్నాడు జిల్లాకేంద్రంలోని ప్రియదర్శిని నగర్‌కు చెందిన కోటగిరి గోపి. 12 ఏళ్లుగా బంకమట్టితో విగ్రహాలను తయారు చేస్తున్నాడు. సాధారణ సహజ సిద్ధ రంగులతో జీవం ఉట్టిపడేలా వినాయక ప్రతిమలను తీర్చిదిద్దుతున్నాడు. ఆయన తయారుచేసిన వినాయక ప్రతిమలను చూస్తే ఆశ్చర్యం కలుగకమానదు. నల్ల మట్టిలో ఒదిగిపోయిన ప్రకృతి రమణీయతను చూసి అతడిని అభినందించకుండా ఉండలేం.

వినాయక విగ్రహాల తయారీ కేంద్రాలు...

ఉమ్మడి జిల్లాలోని నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల తదితర ప్రాంతాలలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో కూడిన గణనాథుల్ని తయారుచేసే కేంద్రాలున్నాయి. గుజరాత్, రాజస్థాన్, బీహార్‌కు చెందిన కూలీలతో ప్లాస్టర్‌ఆఫ్ పారీస్ ప్రతిమలను తయారు చేయిస్తుండగా.. మరోవైపు పర్యావరణ ప్రేమికులు మట్టి విగ్రహాలను సిద్ధం చేస్తున్నారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలోని మండపాల నిర్వాహకులు విగ్రహాలకు ఇప్పటికే ఆర్డర్లు ఇచ్చేశారు. వారు కోరుకున్న రూపాన్ని తయారు చేయించుకుంటున్నారు.

మన దగ్గరనుంచే మార్పు..

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ కంటే సాధారణ బంకమట్టితో తయారుచేసిన గణనాథుని నెలకొల్పేందుకు ప్రాధాన్యతనివ్వాలి. అలాంటి వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించే వారిని ప్రోత్సహించేలా అధికారులు, పాలకులు ఆలోచన చేయాలి. విగ్రహాల నిమజ్జనం పూర్తయిన తర్వాత చెరువుల్లో నిండిపోయి ఉన్న ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ఇతర వ్యర్థాలను తొలగించే ప్రయత్నం చేయాలి. మండపాల వద్ద ప్లాస్టిక్ రహిత వస్తువులను ఉపయోగించేందుకు అవగాహన కల్పించాలి.

ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో అనర్థాలు...

ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారుచేసిన విగ్రహాలతో ఉమ్మడి జిల్లాలోని చెరువులు, కుంటలు కలుషితమవుతున్నాయి. ఆ విగ్రహాలకు వేసిన రంగులతో ప్రకృతికి హాని కలుగుతోంది. ఇందులోని కాల్షియం సల్ఫేట్ అనే రసాయనం నీటిలో కరగకపోవడంతో తెట్టులా ఏర్పడి భూగర్భ జలాలు కూడా ఇంకిపోయే ప్రమాదం ఉంది. జలచరాలు రసాయనాల ప్రభావంతో చనిపోయే అవకాశం ఉంటుంది. ఈ నీటిని తాగిన పశుపక్షాదులు కూడా అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంది. ఆ నీటిని వినియోగించడం వల్ల కాలేయ, చర్మ, శ్వాస సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వంటి ధూళికణాలు కళ్లలో పడితే కంటి చూపు మందగించే ప్రమాదం ఉంటుంది.

పర్యావరణ పరిరక్షణకు తనవంతు బాధ్యతగా...



జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ అంబేద్కర్ కాలనీకి చెందిన యువకుడు అడ్డిగ శ్రావణ్‌కుమార్ మట్టితో వినాయక ప్రతిమలను మలుస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. సజీవకళ ఉట్టిపడేలా తయారుచేసిన వినాయక విగ్రహాలను ఎలాంటి శిక్షణ లేకుండా నేర్చుకుని పర్యావరణానికి తన వంతు బాధ్యతగా తోడ్పడుతున్నాడు. మట్టి ప్రతిమల తయారీలో మంచి ప్రతిభతో తయారుచేసిన విగ్రహాలను ఇతరులకు ఉచితంగా అందజేస్తున్నాడు.

ఒంటిచేత్తో మలిచి.. ఏకదంతున్ని పూజించి..



ఏటా రసాయనాలతో తయారుచేసిన ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలని వాడకుండా ఇంట్లో పూజ కోసం సొంతంగా తనే ఒంటి చేత్తో విగ్రహం రూపొందిస్తున్నాడు సారంగాపూర్ మండలం బోరిగాం గ్రామానికి చెందిన ముక్తపల్లి చిరంజీవి. ప్రమాదంలో ఒకచేయిని కోల్పోయినా సాధారణ బంకమట్టితో స్వయంగా మలిచిన వినాయక విగ్రహానికి పండగ రోజున పూజలు చేయడం ద్వారా మనసుకు సంతృప్తినిస్తుందని పేర్కొంటున్నాడు.

క్లీమోమ్ వ్యవస్థాపకురాలు, మాజీమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కోడలు దివ్యారెడ్డి సైతం ప్రకృతి ప్రేమికురాలిగా ఏటా గోమయంతో తయారుచేసిన వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. పండగకు కొన్ని రోజుల ముందు నుంచి గోమయంతో వినాయక ప్రతిమలను తయారు చేయించి నిర్మల్ జిల్లాలో పంపిణీ చేస్తూ ప్రకృతి పరిరక్షణలో భాగస్వామి అవుతున్నారు.

గణేశ్ మండపాలకు అనుమతి తప్పనిసరి

- ప్రతీ మండపం వద్ద నిబంధనలు పాటించాలి
- ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్‌టౌన్: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసే గణేశ్ మండపాలకు నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఎస్పీ జానకీ షర్మిల సూచించారు. ఇందుకోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. నిర్వాహకులు తాము ఏర్పాటు చేసే గణేశ్ ప్రతిమ ఎత్తు, ఏర్పాటు చేస్తున్న ప్రదేశం, నిమజ్జనం తేదీ వివరాలతో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న https://policeportal.tspolice.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అనంతరం సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులు ఆన్‌లైన్ ద్వారా అనుమతులు జారీ చేస్తారని తెలిపారు. రిజిస్ట్రేషన్ అయ్యాక పోలీసుస్టేషన్ నుంచి వచ్చే అనుమతితోపాటు జారీ చేసిన సూచనల పట్టిక మండపం వద్ద ఉంచాలని పేర్కొన్నారు.

విద్యుత్ శాఖ అనుమతి..

గణేశ్ మండపాలకు విద్యుత్ కనెక్షన్ కోసం ఆ శాఖ నుంచి అనుమతి తీసుకోవాలని తెలిపారు. షార్ట్ సర్క్యూట్ జరుగకుండా నాణ్యమైన తీగలను ఉపయోగించాలని సూచించారు.

నిబంధనలు పాటించాలి

గణేశ్ మండపాల నిర్వాహకులు వారి మండపాల కమిటీ వివరాలు, మండపాల బాధ్యత వహించే వారి వివరాలు, ఫోన్ నంబర్లతో కూడిన ఫ్లెక్సీలను మండపం వద్ద తప్పనిసరి ఏర్పాటు చేయాలన్నారు. నిమ్మజ్జనం కోసం ప్రతీ వినాయకుడి వెంట ఐదుగురిని ప్రత్యేక టీషర్ట్‌లో ఉంచాలని సూచించారు. మండపాల వద్ద అగ్ని ప్రమాదం జరుగకుండా ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. తక్కువ శబ్ద కాలుష్యంతో కేవలం రెండు స్పీకర్లను మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు.

అనుమానాస్పదంగా కనిపిస్తే సమాచారం ఇవ్వాలి

మండపాల వద్ద ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు, వస్తువులు కనిపిస్తే డయల్ 100కు గానీ, స్థానిక పోలీసులకు గానీ సమాచారం ఇవ్వాలని తెలిపారు. మండపాల వద్ద మద్యం సేవించడం, పేకాట ఆడటం, లక్కీ డ్రాలు నిర్వహించడం, అసభ్యకర నృత్యాలు చేయడం నిషేధమన్నారు. ప్రతీ మండపం వద్ద పాయింట్ పుస్తకం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పోలీసులు తనిఖీకి వచ్చినప్పుడు అందులో రాసి, సంతకం చేస్తారని తెలిపారు.

వర్షాలపై అలర్ట్

- వాతావరణ శాఖ హెచ్చరికలతో అధికారుల అప్రమత్తం
- శనివారం సాయంత్రం నుంచి మొదలైన వాన
- రెండు రోజులు అప్రమత్తంగా ఉండాలన్న కలెక్టర్
- కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు



నిర్మల్ పట్టణంలో శనివారం సాయంత్రం కురుస్తున్న భారీ వర్షం..

నిర్మల్: బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వాతావరణశాఖ పేర్కొంది. ఆది, సోమవారాల్లో కుండపోత వానలు కురుస్తాయని తెలిపింది. ఈనేపథ్యంలో సీఎస్ శాంతికుమారి ఆదేశాల మేరకు కలెక్టర్ అభిలాష అభినవ్ జిల్లా అధికారులూ అలర్ట్ చేశారు. ప్రాజెక్టుల వద్ద ఇన్‌ఫ్లో పరిశీలించాలని, లోతట్టు ప్రాంతాల వాళ్లను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. గర్భిణులను ముందస్తుగా ఆస్పత్రులకు తరలించే ఏర్పాట్లు చేయాలని వైద్యశాఖకు సూచించారు. కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసి టోల్‌ఫ్రీ నంబర్ 63056 46600ను ఏర్పాటు చేశారు.

జిల్లాలో వాన షురూ..

జిల్లాలో మూడేళ్లుగా అతిభారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ ఏడాది భారీ వర్షాలు నమోదు కాలేదు. ప్రస్తుతం వాయుగుండం కారణంగా జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వాతావరణశాఖ రెడ్‌అలర్ట్ జారీ చేసింది. ఈ మేరకు శనివారం సాయంత్రం నుంచే వాన మొదలైంది. రాత్రి 10 గంటల నుంచి భారీ వర్షం కురిసింది. ఆదివారం జిల్లా తూర్పు ప్రాంతంలో, సోమవారం జిల్లాలో గోదావరి పరీవా హక ప్రాంతాల్లో 80–115 మి.మీల వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి.

అప్రమత్తంగా ఉండాలని..

భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్న నేపథ్యంలో కలెక్టర్ అభిలాష అభినవ్ జిల్లా అధికారులనూ అప్రమత్తం చేశారు. రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, పంచాయతీరాజ్, విద్యుత్, వైద్యారోగ్య, విపత్తు నివారణ తదితర శాఖలను అలర్ట్‌గా ఉండాలని ఆదేశించారు. రోడ్డు కనెక్టివిటీ లేని, లోతట్టు ప్రాంతాల్లో ఉన్నవారిని అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు ముందుగానే తరలించేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

వరుసగా భారీగానే..

2021 జులై 22.. ఆరోజును నిర్మల్ ఎప్పటికీ మర్చిపోదు. జిల్లాకేంద్రంలోని జీఎన్ఆర్ కాలనీని వేకువజామునే వరద ముంచెత్తింది. భారీవర్షాలకు స్వర్ణనది పోటెత్తడంతో మొత్తం కాలనీ జలదిగ్బంధమైంది. ఇళ్లన్నీ నీటమునిగాయి. రోజంతా పిల్లాపాపలతో ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకుని రెండో అంతస్తులో గడిపారు. అదే సమయంలో భైంసాలోని పలుకాలనీలనూ వరద ముంచెత్తింది. అప్పటి నుంచి వరుసగా జిల్లాను భారీవర్షాలు, వరదలు భయపెడుతూనే ఉన్నాయి. రెండేళ్ల కడెం ప్రాజెక్టు తెగిపోతుందేమో.. అన్నట్లు మహావరద పోటెత్తింది. ఈసారి సీజన్‌లోనే ఆస్థాయి వానలు, వరదలు రాలేదు. తాజాగా.. రాష్ట్రానికి రెడ్‌అలర్ట్ జారీ అయిన నేపథ్యంలో జిల్లాలోనూ భారీవర్షాలకు అవకాశం ఉన్నట్లు అధికారులు హెచ్చరిస్తున్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు

- డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజేందర్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రైవేటు ఆస్పత్రుల్లో అధికంగా ఫీజులు వసూలు చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్ హెచ్చరించారు. కలెక్టరేట్ ప్రాంగణంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 2010పై శనివారం సమావేశం నిర్వహించారు. యాక్ట్ నిబంధనల గురించి మెటర్నల్ హెల్త్ నోడల్ అధికారి డాక్టర్ సౌమ్య, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారె రవీందర్ వివరించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 2010, 2022 నిబంధనల ప్రకారం ఆస్పత్రుల్లో సేవలందించాలన్నారు. ప్రతీ ఆస్పత్రిలో సేవల రుసుము తెలిపే చార్ట్ ప్రదర్శించాలని సూచించారు. చికిత్స చేసే వైద్యుల పేర్లు, వారి అర్హతలు తెలిపే పత్రాలను ప్రదర్శించాలని పేర్కొన్నారు. వైద్యులు మారితే జిల్లా వైద్యాధికారికి తెలియజేయాలన్నారు. ప్రతీ ఆస్పత్రిలో రోగులకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ మురళీధర్ మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రులను నిర్వహించే వారందరూ నిబంధనలను పాటించి, చికిత్స అందించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఇద్రిస్, కార్యక్రమ నిర్వహణ అధికారులు డాక్టర్ నయనారెడ్డి, డాక్టర్ రాజారమేశ్, డాక్టర్ శ్రీనివాస్, ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు, మేనేజింగ్ డైరెక్టర్స్, కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

నిర్మల్ మున్సిపాలిటీకి రూ.65 కోట్లు మంజూరు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, పక్కన సీనియర్ కౌన్సిలర్ రాజేందర్

నిర్మల్‌టౌన్: నిర్మల్ మున్సిపాలిటీకి అమృత్ 2.0 పథకం కింద రూ.65 కోట్లు మంజూరయ్యాయని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. అనంతరం ఈశ్వర్ మాట్లాడారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులు వేతనాలు వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. అమృత్ 2.0 పథకం ద్వారా మంజూరైన నిధులను తాగునీటి సరఫరాకు వినియోగిస్తామని పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేయాలని ఇన్‌చార్జి మంత్రి సీతక్కతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందించామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లామని చెప్పారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన హైడ్రాను నిర్మల్‌కు తీసుకురావాలని కోరారు. రానున్న గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకునేలా మున్సిపల్ తరఫున ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

కులగణన చేపట్టాలి



ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ప్రకారం.. కుల గణన చేపట్టిన బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని హిందూ బీసీ మహాసభ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ నూనెల ఆచార్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్న కుల గణన చేపట్టలేదన్నారు. బీసీ డిక్లరేషన్ అమలు కోసం హిందూ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్, ఆజాదిగా యూత్ ఫెడరేషన్ అధ్యక్షుడు సంజయ్ కుమార్ ఏడు రోజులుగా ఆమరణదీక్ష చేస్తున్నారన్నారు. గాంధీ ఆస్పత్రిలో వారి ఆరోగ్యం క్షీణిస్తోందని తెలిపారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ప్రక్రియ మొదలుపెట్టి ఆమరణ దీక్ష విరమింపజేయాలని కోరారు. కార్యక్రమంలో హిందూ బీసీ మహాసభ జిల్లా కమిటీ సభ్యులు డి.గంగాధర్, శ్రీనివాస్‌వర్మ, ఎస్.రాము పాల్గొన్నారు.

పోలీస్ పరేడ్, దర్బార్ నిర్వహణ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు కార్యాలయంలో శనివారం వారాంతపు పోలీస్ పరేడ్, దర్బార్ నిర్వహించారు. ఎస్పీ జానకీషర్మిల పరేడ్‌ను పరిశీలించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పరేడ్ నిర్వహించడం వలన సిబ్బందికి విధుల్లో క్రమశిక్షణ, శరీరాక దృఢత్వం పెరుగుతుందన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ

మహిళల రక్షణలో ప్రభుత్వాలు విఫలం



ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

నిర్మల్‌చైన్‌గేట్: మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని, మహిళల రక్షణకు ఎన్ని చట్టాలు చేసినా పటిష్టంగా అమలు చేయడం లేదని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఏ.రాజమణి అన్నారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కోల్‌కతా వైద్య విద్యార్థిని ఘటనపై నిరసన తెలిపారు. రాజమణి మాట్లాడుతూ వైద్య విద్యార్థినిపై జరిగిన దాడిని ఖండించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ కోశాధికారి శైలజ, నాయకులు నరసమ్మ, మాధవి, భాగ్య, తులసి, హేమ, లక్ష్మి పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో గుత్తాధిపత్యం

- యూనివర్సిటీలో టెండరు లేకుండా కాంట్రాక్టర్లకు పనులు
- కాంట్రాక్టు గడువు ముగిసి రెండేళ్లయినా పాతవారికే కొనసాగింపు
- గత ప్రభుత్వం ఆదేశించినా మారని అధికారులు తీరు
- పనులు అప్పగించడం వెనుక భారీగా అక్రమాలు



ట్రిపుల్‌ఐటీ మెస్‌లో అప్పటి గవర్నర్ తమిళసై సౌందర్యరాజన్(ఫైల్)



ట్రిపుల్‌ఐటీ పరిసరాలు పరిశీలిస్తున్న అప్పటి గవర్నర్ తమిళసై (ఫైల్)



వసతిగృహంలో విద్యార్థినులతో మాట్లాడుతున్న అప్పటి గవర్నర్ తమిళసై (ఫైల్)

భైంసా: విద్యార్థులకు ఉన్నతమైన విద్యాబోధనతో భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాల్సిన బాసర రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) అవినీతికి కేరాఫ్‌గా మారింది. విద్యార్థుల సంక్షేమానికి పాటుపడాల్సిన అధికారగణం కాంట్రాక్టర్ల సేవలో తరిస్తున్నారన్న విమర్శ సర్వత్రా వినిపిస్తోంది. కాంట్రాక్టర్ల నజరానాలకు ఆశపడో.. నేతల ఒత్తిళ్లకు తలొగ్గి నిబంధనలకు విరుద్ధంగా యూనివర్సిటీలో పనులు కేటాయిస్తున్నారు. ప్రభుత్వంలో ఏదైనా కాంట్రాక్టు అంటే గడువు ఉంటుంది. ఆ గడువు ముగియగానే నిర్వహణ, వివిధ పనుల కోసం టెండరు నిర్వహించి కొత్తవారిని నియమించాలి. ఈ ప్రక్రియ అంతా పారదర్శకంగా చేపట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది. కానీ, బాసర ట్రిపుల్ ఐటీ అధికారులు కాంట్రాక్టర్లు చెప్పిందే వేదంగా భావిస్తూ పాటిస్తున్నారు. కాంట్రాక్టు గడువు ముగిసి ఏళ్లు గడుస్తున్నా నిబంధనలకు విరుద్ధంగా పాతవారినే కొనసాగిస్తున్నారు. పాతవారిపై పలు ఆరోపణలున్నా.. వారి సేవలోనే తరిస్తున్నారు. ఇలా ఒకటి రెండు విషయాల్లో కాదు యూనివర్సిటీలో వివిధ విభాగాల్లో ఉన్న ప్రైవేటు సంస్థల అన్ని కాంట్రాక్టు గడువులు ముగిసినా ఇంకా కొనసాగించడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి కొన్ని సంస్థలపై ఫిర్యాదులు ఉన్నా చర్య తీసుకోకపోవడం, వెంటనే టెండర్లు నిర్వహించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ట్రిపుల్‌ఐటీ సమస్యలు తెలుసుకునేందుకు అప్పటి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఇక్కడికి చేరుకుని మెస్‌లు, పరిసరాలు, వసతిగృహాలు తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. అయినా ఎలాంటి మార్పురాలేదు. గత ప్రభుత్వ మంత్రులు కేటీఆర్, సబితాఇంద్రారెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి యూనివర్సిటీని సందర్శించిన సమయంలో ఆదేశించినా అధికారుల తీరు మారలేదు. పాతవారికే గడువు పెంచుతూ వస్తున్న అధికారులు వేసవిసెలవుల్లో టెండర్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉన్నా పట్టించుకోలేదు. టెండర్ వేస్తే ఏడాది కాలానికి కాంట్రాక్ట్ వస్తుంది కానీ ఇక్కడ అధికారులు కాంట్రాక్టర్లకు మూడు ఏళ్ల నుంచి రెన్యూవల్ చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో రూ.కోట్ల అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి

జరుగుతుంది ఇదీ..

- యూనివర్సిటీలో హౌస్ కీపింగ్ కాంట్రాక్టు గడువు ముగిసింది. గడువు కంటే రెండు నెలల ముందుగానే టెండరు ప్రక్రియ ముగించి కొత్త వారిని అధికారులు సిద్ధం చేయాలి. కానీ మూడేళ్లు గడిచినా పాతవారినే కొనసాగిస్తున్నారు. సరైన సమయానికి వేతనాలు ఇవ్వక, వారికి రావాల్సిన ప్రయోజనాలు అందజేయకపోవడంతో ప్రస్తుతం ఉన్న సంస్థ తీరును నిరసిస్తూ కార్మికులు ఆందోళనలు చేశారు.
- క్యాంపస్‌లోని సెక్యూరిటీ బాధ్యతలు నిర్వహించే కంపెనీ కాంట్రాక్టు గడువు సైతం మూడేళ్ల క్రితమే ముగిసింది. ఇంకా సదరు కంపెనీనే అధికారులు కొనసాగిస్తున్నారు.
- యూనివర్సిటీలో 9 వేల మంది విద్యార్థులు ఉండగా వారి భోజన బాధ్యతలు, నిర్వహణను అధికారులు ప్రైవేటు క్యాటరింగ్ సంస్థలకు అప్పగించారు. ఈ మూడు క్యాటరింగ్ సంస్థల కాంట్రాక్టు గడువు ముగిసి రెండేళ్లు అవుతోంది. కానీ అధికారులు ఇప్పటి వరకు టెండర్లు పిలవడం లేదు. అనేకసార్లు విద్యార్థుల భోజనంలో పురుగులు రావడం, ఫుడ్ పాయిజన్ వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి పలు క్యాటరింగ్ సంస్థలపై అనేక ఫిర్యాదులు వచ్చాయి. అయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. టెండర్ లేకుండా పాతవారినే వారినే కొనసాగిస్తున్నారు.
- యూనివర్సిటీ పరిపాలన అవసరాల కోసం మ్యాన్ పవర్‌ను అందించే సంస్థ కాంట్రాక్టు గడువు ముగిసి రెండేళ్లవుతుంది. ఇంకా వారినే కొనసాగిస్తున్నారు.
- యూనివర్సిటీలో సూపర్‌మార్కెట్, హాస్టల్ భవనాల్లోని జనరల్ స్టోర్స్ ఎలాంటి టెండరు లేకుండా అధికారుల బంధువులకు కేటాయించారనే ఆరోపణలు ఉన్నాయి. కొన్నేళ్ల నుంచి ఇవి అక్రమంగా కొనసాగుతున్నట్లు సమాచారం. అద్దె కూడా చెల్లించడం లేదని తెలిసింది. వీటిపై అనేక ఫిర్యాదులు ఉన్నా అధికారులు నోరు మెదపకపోవడం అనుమానాలకు తావిస్తోంది.
- ఈ కాంట్రాక్టు సంస్థలు, యూనివర్సిటీకి మధ్య ఏడాదిలో రూ.60 నుంచి రూ.90 కోట్ల వరకు లావాదేవీలు జరుగుతాయి. పెద్ద ఎత్తున జరిగే ఈ కాంట్రాక్టులు టెండర్ లేకుండా కొనసాగించడానికి అదే స్థాయిలో అవినీతి జరుగుతుందనే ఆరోపణలు ఉన్నాయి.

త్వరలోనే అన్ని టెండర్లు పిలుస్తాం..

యూనివర్సిటీలో గడువు ముగిసి పలు కాంట్రాక్టు సంస్థల స్థానంలో కొత్త టెండర్లు పిలవడంతో కొంత జాప్యం జరిగింది. గడువు ముగిసిన అన్ని కాంట్రాక్టు సంస్థల స్థానంలో కొత్త టెండర్ ఫైళ్లు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అవి రెడీ కాగానే కొత్త టెండర్లు పిలిచి కాంట్రాక్టు అప్పగిస్తాం.

– ప్రొఫెసర్ వెంకటరమణ, ఇన్‌చార్జి వీసీ

క్లుప్తంగా

ఉమ్మడి జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విష్ణుకుమార్‌తో హెచ్‌ఎం, పీడీ

కాసిపేట: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థి బానోతు విష్ణుకుమార్ ఉమ్మడి జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సాంబమూర్తి తెలిపారు. క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం మందమర్రి మండలం బొక్కలగుట్టలో జిల్లాస్థాయి అండర్–14 ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. విష్ణుకుమార్ ప్రతిభ కనబర్చి ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. విద్యార్థినిని, పీడీ భుక్య రాజన్నను అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ స్వరూప, ఉపాధ్యాయులు అభినందించారు.

పంటచేలో నెమలి అప్పగింత



ఎఫ్‌బీవోకు నెమలిని అప్పగిస్తున్న రైతు

దిలావర్‌పూర్: పంట చేలల్లో ఉన్న నెమలిని రైతులు అటవీ అధికారులకు అప్పగించారు. శనివారం దిలావర్‌పూర్‌లోని పంట చేలలో రైతులు రవి, శ్రీకాంత్ పనులు చేస్తుండగా నెమలి అరుపులు వినిపించాయి. దగ్గరకు వెళ్లి చూడగా నడవలేని స్థితిలో ఉండడంతో అటవీ అధికారులకు సమాచారం అందించారు. ఎఫ్‌బీవో మీనా అక్కడికి చేరుకోగా నెమలిని అప్పగించారు. దానికి చికిత్స చేయించి అటవీప్రాంతంలో వదిపెడుతామన్నారు. అటవీ శాఖ వాచర్లు ఆలంఖాన్, పోశెట్టి తదితరులు ఉన్నారు.

మొరం ట్రాక్టర్ల పట్టివేత



పట్టుకున్న మొరం ట్రాక్టర్లు

ఖానాపూర్: పట్టణ శివారులో అక్రమంగా తరలిస్తున్న మూడు మొరం ట్రాక్టర్లను పక్కా సమాచారంతో శనివారం పట్టుకున్నామని తహసీల్దార్ శివరాజ్ తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్లను స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఎవరైనా అక్రమంగా మొరం తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

ఏటీఎం చోరీకి యత్నించిన నిందితుడి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని శాంతినగర్‌లోని ఎస్బీఐ ఏటీఎంలో చోరీకి యత్నించిన నిందితుడు అందెరే సునీల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. నార్నూర్ మండలం బొప్పారానికి చెందిన నిందితుడు గురువారం రాత్రి ఏటీఎంలోకి చొరబడి చోరీకి యత్నించారు. సీసీ ఫుటేజీ పరిశీలించి గుర్తించారు. శనివారం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు బస్టాండ్ ఎదుట సునీల్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతన్ని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు సీఐ పేర్కొన్నారు.

కెలిబి శివారులో పులి పాదముద్రలు!



పులి పాదముద్రలు

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని కెలిబి శివారులో మొహర్లే రమేశ్, ప్రకాశ్‌లకు చెందిన పొలాల సమీపంలో ఉన్న చెరువు వద్ద గురువారం పులి పాదముద్రలు కనిపించాయి. ఐదారు రోజులుగా పొలంలో అరక దున్నుతున్నప్పుడు ఎడ్లు చెరువు వద్దకు వెళ్లగానే వెనక్కు మళ్లుతున్నాయని, ఇదేమిటని శనివారం చెరువువద్ద వెళ్లి చూడగా పందిని హతమార్చినట్లు తెలిసిందని రైతులు చెబుతున్నారు. ఈ విషయాన్ని ఎఫ్‌ఆర్వో మజారొద్దీన్‌కి తెలుపగా అటవీ సిబ్బంది ఘటన స్థలానికి వెళ్లి చూశారు. పులి పాదముద్రలుగా గుర్తించి, మూడు రోజుల క్రితం ఏర్పడినవని తెలిపారు. పులి సంచారం విషయం సమీప గ్రామాల ప్రజలకు దావానంలా వ్యాపించడంతో భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆదివారం గ్రామసభలు నిర్వహించి ప్రజలకు పలు సూచనలు ఇస్తామని ఎఫ్‌ఆర్వో తెలిపారు. అధికారులు స్రవంతి, వందన, నజీర్‌అలీ, జమీర్, గౌసుద్దీన్ ఉన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి



మాట్లాడుతున్న డీఎస్పీ కరుణాకర్

కాగజ్‌నగర్‌రూరల్: శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు కృషి చేస్తున్నారని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ తెలిపారు. పట్టణంలోని కాపువాడ, భట్‌పల్లి చౌరస్తా వద్ద శనివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని వంద బైక్‌లు, మూడు ఆటోలను సీజ్ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ ఫ్లెఓవర్ బ్రిడ్జి కింద గంజాయి సేవించే యువకులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. మట్కా, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణ సీఐ శంకరయ్యతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల బృందాలు సిద్ధంగా ఉండాలి



మాట్లాడుతున్న సమన్వయకర్త సుజయ్‌సర్కార్

భైంసా: స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2024లో జరగబోయే కార్యక్రమానికి సిద్ధంగా ఉండాలని కార్యక్రమ సమన్వయ కర్త సుజయ్‌సర్కార్ విద్యార్థులకు సూచించారు. శనివారం బాసర ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులతో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశ్రమలు, ఇతర సంస్థలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు విద్యార్థుల బృందాలు సిద్ధంగా ఉండాలన్నారు. 108 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనబోతున్నారని తెలిపారు. ఆరుగురు విద్యార్థులతో ఒక్కోబృందం ఏర్పాటై సమస్యలకు పరిష్కార మార్గం చూపించాలన్నారు. ఇందుకోసం ట్రిపుల్ ఐటీలో చదివే విద్యార్థుల బృందాలను ఎంపిక చేశామని తెలిపారు. త్వరలోనే పరిశ్రమల ప్రతినిధులు, జ్యూరీ మెంబర్లు రెండవ రౌండ్‌లో ఇందులో ప్రతిభ ఉన్నవారినే ఎంపికచేస్తారని తెలిపారు. స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ సాఫ్ట్‌వేర్ ఎడిషన్‌ను సులభతరం చేసేందుకు కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ ఓ కార్యక్రమం ఏర్పాటు చేసిందన్నారు. ఇందులో భాగంగా బృందాలుగా ఏర్పడిన విద్యార్థులకు కొన్ని ప్రశ్నలు ఇస్తే సమాధానం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. స్టూడెంట్ ఇన్నోవేషన్ కేటగిరి కింద మూడు నగదు బహుమతులు ఇస్తారని అన్నారు. ప్రథమ బహుమతి కింద రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.75 వేలు, తృతీయ బహుమతి రూ.50 వేలు అందించనున్నట్లు తెలిపారు. 2019, 2022లో రెండుసార్లు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు ప్రథమ బహుమతులు అందుకున్నారన్నారు. మళ్లీ ఈఏడాది ప్రథమస్థానంలో నిలవాలని సూచించారు. జ్యూరీ మెంబర్లు సీహెచ్‌ఓ డి.వెంకటరమణ, రాకేశ్‌రెడ్డి, నాగమణి, పీఆర్‌ఓ డా. విజయ్‌కుమార్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

'కాయిన్'దందాపై ఖాకీల దృష్టి

- పలువురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం

నిర్మల్: వివిధ 'కాయిన్'ల పేరిట భారీ పెట్టుబడులు పెట్టిస్తున్న దందాపై జిల్లా పోలీసులు దృష్టి పెట్టారు. ప్రస్తుతం మార్కెట్లో క్రిప్టో కరెన్సీకి పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో వివిధ రకాల 'కాయిన్స్'పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఇందులో చాలావరకు ఎలాంటి ఆధారాలు, వివరాలు ఇవ్వకుండా కేవలం ఆన్‌లైన్ ఆధారంగా దందా చేస్తున్నాయి. ఇవన్నీ చైన్‌లింక్ దందాలు కావడం, మొదట్లో లాభాలు బాగా ఇస్తుండటంతో చాలామంది ఆసక్తి చూపుతున్నారు. ప్రధానంగా ఉపాధ్యాయులు, కిందిస్థాయి ఉద్యోగులు, ప్రైవేటువ్యాపారులు చైన్‌లింక్‌లను పెంచుకుంటూ పోతున్నారు.

పోలీసుల అదుపులో..!?

ఎలాంటి అనుమతులు, ఆధారాలు లేని 'కాయిన్స్'దందాలను విస్తరిస్తూ రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. ఇందులో చాలామంది ప్రభుత్వ ఉపాధ్యాయులు, వార్డెన్లు, ఉద్యోగులు, అధికారులు, వైద్యులు, కానిస్టేబుళ్లు ఉండటం గమనార్హం. కొందరు విధులకు వెళ్లకుండా ఈ వ్యాపారాన్నే చేస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నతాధికారుల వరకూ వెళ్లాయి. ఈనేపథ్యంలో శనివారం పలువురిని సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఇందులో పలువురు ఉపాధ్యాయులు, ఒకరిద్దరు అధికారులు కూడా ఉన్నట్లు సమాచారం. జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన ఈ ఘటనపై పోలీసులు ఆదివారం వివరాలు వెల్లడించే అవకాశం ఉంది.


రెండు బైక్‌లు ఢీ, ఒకరి మృతి



సుదర్శన్ మృతదేహం

నేరడిగొండ: మండలంలోని రోల్‌మామడ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొని ఒకరు మృతిచెందారు. వివరాలు ఇలా ఉన్నాయి..యాపల్‌గూడ గ్రామానికి చెందిన పెందూర్ సుదర్శన్(37) మేస్త్రీ పనుల కోసం ప్రతిరోజు బైక్‌పై వెళ్లి వస్తుంటాడు. శుక్రవారం రాత్రి నేరడిగొండ నుంచి ఇంటికి వెళ్తుండగా ఓ వ్యక్తి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై అతివేగంగా వచ్చి ఢీకొనడంతో గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని ఎన్‌హెచ్‌ఏఐ అంబులెన్స్‌లో నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రాత్రి మృతిచెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. భార్య లక్ష్మీబాయి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



కాత్లే ప్రభు (ఫైల్)

గుడిహత్నూర్: మండలంలోని మాన్కాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కాత్లే ప్రభు మృతిచెందాడు. ఎస్సై ఇమ్రాన్ కథనం ప్రకారం..నార్నూర్ మండలం కంపూర్ గ్రామానికి చెందిన కాత్లే ప్రభు (43) గతేడాది క్రితం మాన్కాపూర్‌కు వచ్చి మాధవ్ వద్ద పాలేరుగా పని చేస్తున్నాడు. శనివారం ఉదయం బహిర్భూమికి వెళ్తుండగా ఉట్నూర్ నుంచి ఆదిలాబాద్ వైపు అతివేగంగా వెళ్తున్న కారు ప్రభును వెనుక నుంచి ఢీకొంది. తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు ఘటన స్థలానికి వెళ్లారు. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.

జ్వరంతో విద్యార్థిని మృతి

వాంకిడి: మండలంలోని ఇందానికి చెందిన ఐశ్వర్య (17) జ్వరంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి మృతిచెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. ఐశ్వర్య గత వారం రోజుల నుంచి జ్వరంతో బాధపడుతుంది. తల్లిదండ్రులు మంగళ– భీమ్‌సన్ ఆమెను మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. కొన్నిరోజులు బాగానే ఉన్నా శుక్రవారం మళ్లీ అస్వస్థతకు గురైంది. శుక్రవారం రాత్రి మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది.

ఉరేసుకుని విద్యార్థిని ఆత్మహత్య



రక్షిత (ఫైల్)

ఉట్నూర్‌రూరల్: ఓ విద్యార్థిని చదువులో మంచి మార్కులు సాధిస్తూ ఉద్యోగం చేసి కుటుంబానికి ఆసరాగా నిలువాలని అనుకుంది. ఏం కష్టం వచ్చిందో ఏమో కాని ఆమె ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. నిజామాబాద్ జిల్లా రుద్రూర్‌లో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఉట్నూర్ మండలం హస్నాపూర్‌కు చెందిన విష్ణు–వనిత దంపతులకు ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. విష్ణు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రెండో కుమార్తె లింగన్‌వాడ్ రక్షిత(17) నిజామాబాద్ జిల్లా రుద్రూర్‌లో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశం పొందింది. మూడు రోజుల క్రితమే కళాశాల వెళ్లింది. శనివారం బాత్‌రూంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీనికి గల కారణాలు తెలియరాలేదు. రక్షిత మృతితో హస్నాపూర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

దేగాంలో మహిళ..

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామానికి చెందిన గంగధరోళ్ల సావిత్ర (48) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. సావిత్ర బీడీ కార్మికురాలిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంది. భర్త పోతన్న మూడేళ్లుగా మద్యానికి బానిసై పని చేయడంలేదు. రోజు రోజుకు పోషణభారమై ఆర్థిక ఇబ్బందులు పెరిగిపోయాయి. మనస్తాపం చెందిన సావిత్ర శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

దండేపల్లి: గూడెం గ్రా మానికి చెందిన గోప తి రవి (42) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు. ఆయ న కథనం ప్రకారం..రవి గత కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఆసుపత్రి ఖర్చుల కోసం కొంత అప్పు చేశాడు. అయినప్పటికీ కడుపు నొప్పి తగ్గకపోవడం, పైగా వైద్యఖర్చుల కోసం అప్పులు కావడంతో మనస్తాపం చెందాడు. శనివారం పత్తిచేను వద్దకు వెళ్లి గుర్తుతెలియని పురుగు మందు తాగి ఇంటికి వచ్చి కుటుంబీకులకు విషయం చెప్పాడు. వెంటనే వారు ఆటోలో లక్సెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అతను మృతిచెందినట్లు నిర్ధారించారు. భార్య సుమలత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

అమ్మవారిని దర్శించుకున్న పీఠాధిపతి



భైంసా: శ్రావణమాసం చివరి శనివారం సందర్భంగా బాసర సరస్వతి అమ్మవారిని సిద్ధాశ్రమ పీఠాధిపతి రాజయోగి సిద్ధేశ్వర మహారాజ్ దర్శించుకున్నారు. నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం సిద్ధాశ్రమం నుంచి భక్తులతో కలిసి బాసరకు వచ్చారు. లోక కల్యాణార్థం సమస్థ శాంతికి, గోసంరక్షణకు అందరూ పాటుపడాలని కోరారు. అంతకుముందు ఆలయ అధికారులు ఆయనకు తీర్థప్రసాదాలు అందించారు.

హైకోర్టు న్యాయమూర్తుల పూజలు



భైంసా: బాసర సరస్వతీ అమ్మవారిని మహారాష్ట్రలోని ముంబయి, ఔరంగాబాద్ న్యాయమూర్తులు శనివారం దర్శించుకున్నారు. ముంబయి న్యాయమూర్తి నితిన్‌బి సూర్యవంశీ, ఔరంగాబాద్ న్యాయమూర్తి శేలేశ్ పి.బ్రహ్మేలు బాసరకు వచ్చారు. ఆలయ అధికారులు వారిని స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో పూజలు చేసి అమ్మవారి దర్శించుకున్నారు. వేదపండితులు వారికి తీర్థ ప్రసాదాలు అందించి సత్కరించారు.

జిల్లా కళాకారిణికి గద్దర్ అవార్డు



పురస్కారం అందుకుంటున్న నర్సమ్మ

ఆదిలాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన సాంస్కృతిక సారథి కళాకారిణి నర్సమ్మ గద్దర్ అవార్డు అందుకున్నారు. గిద్దె గళం సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ సౌజన్యంతో ఈ అవార్డు అందించారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పురస్కారం స్వీకరించారు. గద్దర్ కుమార్తె వెన్నెల, ప్రొఫెసర్ కాశీం, గిద్దె రాంనర్సయ్య, జూపాక శివ తదితరులు పాల్గొన్నారు.



అవార్డ్ అందుకుంటున్న పంబాల రమేశ్

గద్దరన్న అవార్డు అందుకున్న పంబాల రమేశ్

కడెం: మండలంలోని పాత మద్దిపడగ గ్రామానికి చెందిన జానపద కళాకారుడు పంబాల రమేశ్ గద్దరన్న అవార్డ్‌ను అందుకున్నాడు. ఈనెల 30న ఖమ్మం జిల్లా తొర్రూర్‌లో 'గిద్దెగళం' ఆధ్వర్యంలో గద్దరన్న అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కాశీం చేతుల మీదుగా రమేశ్ అవార్డు అందుకున్నారు. రమేశ్‌కు అవార్డు రావడంపై జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేశారు.